క్లుప్తంగా

ప్రశాంతంగా అర్హత పరీక్ష



మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన ఇంటర్ అర్హత ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. గంట ముందే పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి పంపించి పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించారు. 600మంది విద్యార్థులకు గాను 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు.

ఇందిరమ్మ సాక్షిగా అభివృద్ధి చేస్తాం

మరికల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ఇందిరమ్మ సాక్షిగా మరికల్ మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ యాత్ర ఆదివారం రాత్రి మరికల్‌కు చేరింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాలు తప్ప, అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ఎంపీగా గెలిచిన వెంటనే సర్వే నంబర్ 449లో భూములను పేదలకు పంచుతామని హామీ ఇచ్చారు. అలాగే సర్వేనంబర్ 1లో కూరగాయల మార్కెట్ నిర్మిస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ మరికల్‌లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడే బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుంభం శివకుమార్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వీరన్న, సూర్యమోహన్, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణ, వినితమ్మ పాల్గొన్నారు.

యాత్రకు తరలిన మహిళలు

పాలమూరు న్యాయ యాత్ర చేపట్టిన చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా పస్పుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ మహిళలు తరలివచ్చారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కృష్ణా: మండలంలోని తంగిడి గ్రామ శివారులో కృష్ణానది నుంచి శనివారం రాత్రి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా స్థానిక ఎస్ఐ నవీద్ పట్టుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమావేశానికి హాజరు కావాలి

మరికల్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించే పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోమవారం నారాయణపేటలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగే విస్తృతస్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

ముళ్ల కంపలను తొలగించండి



కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో 4, 5వార్డుల్లో గత కొన్నిరోజులుగా ముళ్లకంపలను తొలగించాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిహామీ పనులోనైనా ముళ్లకంపలు తొలంచి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. అదేవిధంగా గ్రామంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం

మక్తల్: తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆదేశాలమేరకు పట్టణంలోని ఆదివారం సైక్లింగ్ పోటీలను ఎస్ఐ వైవీ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో 15మంది పాల్గొన్నారు. సైక్లింగ్ పోటీలు కొత్తగార్లపల్లి వైపు దాదాపు 2 కిలోమీటర్లు ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ లక్ష్మారెడ్డిని సన్మానం చేశారు. డీవైఎస్ఓ వెంకటేశ్వష్ శెట్టి, రిటైర్డ్ పీఈటీ గోపాలం, కావలి ఆంజనేయులు, అంబ్రేష్, రాఘవేందర్, జగదీష్ పాల్గొన్నారు.



6న పీయూలో జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 6న శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని ఆసక్తి గల వారు ఉదయం 10గంటలకు పీయూ అకాడమిక్ బ్లాక్‌లో హాజరుకావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9849445877 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పునరుద్ధరణకు నోచుకోని రోడ్లు

- ఎంఆర్ఆర్ నిధులు మంజూరైనా.. టెండర్‌లకు నోచుకోని వైనం
- గతుకు రోడ్లపై ప్రయాణం
- అదుపు తప్పుతున్న వాహనాలు
- నిత్యం అవస్థల ప్రయాణం



అస్తవ్యస్తంగా మారిన రోడ్డు



గుంతల మయమైన సజనాపూర్ రోడ్డు (ఫైల్)

దామరగిద్ద: ప్రాథమిక సదుపాయాలైన విద్య వైద్య, రహదారులు వంటి వాటిల్లో ప్రధానమైన రహదారులు అభివృద్ధికి నోచుకోక గ్రామీణ ప్రజలు నిత్యం ప్రయాణ కష్టాలతో అభివృద్ధికి అమడదూరంలో ఉంటున్నారు. గ్రామాల అభివృద్ధి రహదారులు ఎంతో ప్రధానమైన రోడ్డు సదుపాయ ఉంటే రవాణ వ్యవస్థ, విద్యా, వైద్య, వ్యాపారం సదుపాయాలు అభివృద్ధితో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత దశాబ్ద కాలంలో వేసిన రోడ్లు వర్షాలకు గుంతలు పడి పోవడంతో రహదారులు వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు మంజూరైనా...

మండలంలోని కాన్‌కుర్తి నుంచి ఆశన్‌పల్లి గేట్ వరకు 9.80కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 3.3 కోట్లు మంజూరు చేసిన టెండర్ ప్రక్రియలోనే ఆగింది. క్యాతన్‌పల్లి నుంచి వత్తుగుండ్ల మీదుగా కంసాన్‌పల్లి వరకు 8.40 కిలోమీటర్ల రోడ్డు రెన్యూవల్ మరమ్మతులు చేపట్టేందుకు రూ. 2.32 కోట్లు మంజూరు చేయగా టెండర్ పూర్తి కాలేదు. దామరగిద్ద నుంచి సజనాపూర్ గ్రామం వరకు గతంలో వేసిన రోడ్డు గుంతల మయం కావడంతో మొత్తం 5.50 కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి రూ. 2.08 కోట్లు మంజూరు చేశారు. ఇక ఉల్లిగుండం నుంచి అన్నాసాగర్ మీదుగా నర్సాపూర్ గ్రామం వరకు గత ప్రభుత్వం రూ 1.80 కోట్ల ఎంఆర్ఆర్ నిధులతో మంజూరు చేయగా టెండర్ పూర్తి చేసిన కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. క్యాతన్‌పల్లి నుంచి చాకలోన్‌పల్లి వరకు మంజూరు చేసిన రోడ్డుపనులు సైతం నిలిచిపోయాయి. ఇక లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి తదితర గ్రామాలకు రోడ్లు కేవలం మంజూరుకే పరిమితమవుతున్నాయి. అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మారింది..



గత ఏడేళ్ల కిత్రం నిర్మించిన రోడ్డు తిరగి మరమ్మతుకు నోచుకోవడంలేదు. వర్షాకాలం రోడ్డు దెబ్బతిని గుంతల మయంతో ఆధ్వానంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు మరమత్తులు చేపట్టి రవాణా సదుపాయం కల్పించాలి.

-అశోక్, సజనాపూర్

టెండర్ దశలో ఉన్నాయి..

సజనాపూర్, ఉల్లిగుండం, చాకాలోన్‌పల్లి, కాన్‌కుర్తిటు ఆశన్‌పల్లి, లింగారెడ్డిపల్లి, పిడెంపల్లి గ్రామాలకు గతంలో ఎంఆర్ఆర్ నిధులతో రోడ్లు మంజూరయ్యాయి. ఉల్లిగుండం రోడ్డు టెండర్ ప్రక్రియ పూర్తికాగా మిగిలిన రోడ్ల టెండర్‌లు పూర్తి కావాల్సి ఉంది. టెండర్‌లు కాగానే రోడ్డు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- నర్సింగ్‌రావ్, పీఆర్‌ఏఈ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నారాయణపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదర్శస్కూల్‌లో 2000–01 విద్యా సంవత్సరంలో టెన్త్ విద్యను అభ్యసించిన పలువురు విద్యార్థులు తమ ఉన్నత చదువులు, ఉద్యోగ అన్వేషణ, పెళ్లిళ్లు జరిగి ఒక్కో చోట స్థిర పడ్డారు. అయితే వీరంత కలిసి ఆదివారం స్థానిక ఆదర్శ బీఈడీ కళాశాలలో సమావేశమయ్యారు. ఒక్కొక్కరు వారి కుటుంబ సభ్యులతో హాజరై కళాశాల పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తీపి గుర్తులను ఒకరితో మరొకరు పంచుకుని ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మొల్గాన్‌జనార్దన్, భానుమతి, శ్రీలత, శాంతా, శశికళ, శశిధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు వినతి



ఊట్కూరు: కాచిగూడ నుంచి రాయిచూర్‌కు రోజుకు రెండుసార్లు రైలును నడిపించాలని మండలంలోని జక్లేర్ రైల్వేస్టేషన్ కమిటీ సభ్యులు ఆదివారం సికింద్రాబాద్ రైల్వేబోర్డు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ సభ్యులు మహావీర్ మాట్లాడుతూ.. కర్ణాటక, తెలంగాణ సరిహద్దులో కృష్ణాబ్రిడ్జి పనులు జరుగుతున్నందున కర్ణాటక, తెలంగాణకు రోడ్డుమార్గంలో రాకపోకలు నిలిపివేశారని తెలిపారు. దీంతో ఇరు రాష్ట్రాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాచిగూడ నుంచి జక్లేర్ మీదుగారోజు ఒక మారు రైలు నడుస్తుందని, దీనిని ఉదయం సాయంత్రం వేళల్లో రెండుసార్లు నడిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంకటేష్, కృష్ణ, రఘు, అక్షయ్, లింగప్ప తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ నుంచి అప్పక్‌పల్లి వరకు బీటీరోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆదివారం ఆటో యూనియన్ నాయకులు చొరువ తీసుకుని ఆయా గుంతలను పూడ్చారు. చాలా చోట్ల మధ్యలో తారు పోవడం, సైడ్లకు కోతకు గురికావడంతో వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే దాటుకోవడం సైతం కష్టంగా మారిందని వాపోయారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరువతీసుకుని నూతనంగా మంజూరైన డబల్‌రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో మౌలాలి, గులాంరసూల్ పాల్గొన్నారు.



గుంతలను సరిచేస్తున్న నాయకులు

బాలింతలకు దుప్పట్ల పంపిణీ



మక్తల్: లయన్స్‌క్లబ్ సభ్యుడు రాజుల ఆశిరెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి, చారి, సుకన్య, శేఖర్, రవికుమార్, రవికుమార్‌గౌడ్, సిద్దలింగయ్య, విక్రమ్‌రెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో కొత్తపల్లి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ గ్రామ అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కల్గుతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నర్సింహులు, బలరాం, రామాంజనేయులు, కుమ్మరి నాగప్ప, సురేష్, నర్సింహులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం వీరశైవ లింగాయత్ సమాజం నూతన సంవత్సర కొత్తపల్లి శాఖ క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ మేరకు.. లింగాయత్ సమాజం ఉమ్మడి జిల్లా నాయకులు కొండా విరన్న, గండే రవికుమార్ మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్ సమాజం అభివృద్ధికోసం తమ వంతు సహకారం అందజేస్తామని సూచించారు. కార్యక్రమంలో క్యాతన్‌పల్లి శివకుమార్, సమాజం సభ్యులు మల్లికార్జున్, నాగభూషణం, విరన్న, రాజు, గంగాధర్, శ్రీశైలం, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సమాజం సభ్యులు

పడకేసిన పారిశుద్ధ్యం



మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి చెత్తను అడ్డంగా వేశారు. దీంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో దోమలు పెరిగి రోగాలు ప్రబలుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి వెంబడి స్వచ్ఛత పూర్తిగా కరువైందని ఆరోపిస్తున్నారు. గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమాలను చేపట్టడంలో గ్రామపంచాయతీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక పాలనాధికారులు స్పందించి గ్రామంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

అమరచింత: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందని, బడ్జెట్ కేటాయింపులో సైతం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పాంరెడ్డిపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని మేలు చేకూర్చే విధంగా రూపొందించామని ఆర్థిక మంత్రి చెప్పుకోవడం వింతగా ఉందన్నారు. వ్యవసాయానికి రూ.2,22,251 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు చెప్తున్నా.. వాస్తవంగా రూ.1,17,528 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. దేశంలో 14.75 కోట్ల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ప్రతి ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజు, మోహన్, శంకర్, మాసన్న, శివకుమార్, అశోక్, రాకేష్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పోటీ పరీక్షల్లో విద్యార్థులు పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరవచ్చని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పూర్తి దృష్టి కేంద్రీకరించాలని, ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. కళాశాల ఎంపికల విషయంలో విద్యార్థులు జాగ్రత్త వహించాలని సూచించారు. విజయ్‌కుమార్, శ్రీధర్, జనార్దన్, రజాక్, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ విగ్రహం ఏర్పాటుకు డిమాండ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాజధానితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో బీపీ మండల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో యాదవులకు ఐదు ఎంపీ స్థానాలు కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థలలో జనాభా ప్రాతిపదికన యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనలో ఉపకులాల వారిగా నమోదు చేయాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 18శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండవ విడత గొర్రెల పంపిణీ కింద నగదు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాంతన్న యాదవ్, జుర్రు నారాయణ యాదవ్, భరత్ కుమార్ యాదవ్, బత్తుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మక్తల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతోపాటు అధికదిగుబడులు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ విజయరాం తెలిపారు. ఆదివారం మండలంలోని మంతన్‌గోడ్‌లో వ్యవసాయం రైతులకు అవగహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ద్రవ జీవామృతంతో సూక్ష్మజీలు, అభివృద్ధి చెంది, పైరు ఏపుగా పెరుగుతుందని వివరించారు. అదే క్రమంలో చీడపీడలను తట్టుకుని వేరుశాతం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలబిడిగా వాడుతుండటంతో నేల కలుషితమవుతుందన్నారు. దీంతో దిగుబడులు భారీగా పడిపోతున్నాయని పేర్కొన్నారు. అలా కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడంతో భూమిలో సారం పెరగడంతోపాటు దిగుబడులు కూడా పెరుగుతాయని తెలిపారు. ముకుందరెడ్డి, రవీందర్‌రెడ్డి, శశిధర్, రాజశేఖర్, లక్ష్మిగోశాల పాల్గొన్నారు.



సభ్యులకు జ్ఞాపికలను అందజేస్తున్న విజయరాం

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

ఊట్కూరు: మండలంలోని గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పంచాయతీ ఆవరణలో తాజాగా మాజీలైన సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 5 ఏళ్లలో తాను చేపట్టిన అభివృద్ధిపనుల గురించి వివరించారు. గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, బీటీరోడ్డు తన హయాంలో చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యంతోపాటు పచ్చదనం కోసం మొక్కలునాటి పెంచడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడుతానని తెలిపారు. కార్యదర్శి సుమలత, ఉపసర్పంచ్ ఇబాదూర్ రహమాన్, వార్డు సభ్యులు రఘువీర్, నర్సింహగౌడ్, ఇస్మాయిల్, షమీ, అశోక్, లక్ష్మీ, హేమలత తదితరులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

అద్వాణికి భారతరత్న ప్రకటనపై హర్షం

నారాయణపేట రూరల్: బీజేపీ సీనియర్ నాయకులు, అయోధ్య రథయాత్ర వ్యవస్థాపక సభ్యుడు లాల్ కృష్ణ అద్వాణికి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు నాగురావునామాజీ, రతంగపాండురెడ్డి, పీ.శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అద్వాని పోరాట ఫలితంగానే అయోధ్య రామమందిరం నిర్మితమైందని, పార్టీకోసం అలుపెరుగకుండా పనిచేశారని గుర్తుచేశారు. కేంద్రం కష్టపడిన వారిని గుర్తించడం ఎంతో హర్షదాయకమని, భారతీయులంతా సంతోశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రంలో రఘురామయ్యగౌడ్, రఘువీర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నామాజీ

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో మాస్టర్లు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌పీ వెంకటేష్, సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు నర్సింహులు, హెడ్‌మాస్టర్ బాసిత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులు రాణించాలని సూచించారు. ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. బెల్టులు పొందిన విద్యార్థులను వారు అభినందించారు. ఫౌండర్ వెంకటేష్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 8 మంది ఎల్లో, ముగ్గురు ఆరెంజ్, ముగ్గురు బ్లూ, ముగ్గురు మెరూన్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ అక్షయ, రామకృష్ణ, బుచ్చన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

16న కార్మిక ప్రదర్శన గ్రామీణబంద్

అమరచింత: దేశ వ్యాప్తంగా ఈనెల 16న కార్మిక ప్రదర్శన గ్రామీణ బందు కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. పట్టణంలోని జీఎస్ భవన్‌లో ఆదివారం కార్మిక, వ్యవసాయ, రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరిణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30వేల ఇవ్వాలని, రాష్ట్రంలో రూ.21 వేల వేతనం అమలుచేయాలని కోరారు. ఫిబ్రవరి 10న అమరచింత మండల కేంద్రంలో వాహన ర్యాలీ నిర్వహించాలని, ఇందుకు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న, ప్రసాద్, భాస్కర్, జీఎస్ గోపి, రాజన్న, అజయ్, వెంకటేష్, కుర్మన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పే స్కేల్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సోషల్ ఆడిట్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని సోషల్‌ఆడిట్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగయ్య కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నంశ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులుగా మాదిరిగా తమకు పే స్కేల్‌ను అమలు చేయాలని కోరారు.

32 ఏళ్ల అ'పూర్వ' సమావేశం

ఆత్మకూర్: 32 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలలోని తరగతి గదులన్నీ కలియతిరిగారు. ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 1992–93 పదో తరగతి బాలికల బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యాబుద్దులు నేర్పి న అధ్యాపకులకు శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు.